నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 21 మార్చి 2025 | RANGAREDDY

# కేటీఆర్‌కు ఘన స్వాగతం



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు తూప్రాన్‌పేట్ వద్ద ఘన స్వాగతం పలుకుతున్న ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు తూప్రాన్‌పేట్ వద్ద స్వాగతం పలికిన పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి**

**బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకు రావాలన్న రామన్న**

ఇబ్రహీంపట్నం, మార్చి 20: సూర్యాపేట జిల్లాలో గురువారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి హాజర య్యేందుకు బయలుదేరిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావుకు తూప్రాన్‌పేట్ సమీపంలో ఆ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. కేటీఆర్‌కు ఘనస్వాగతం పలికేందుకు ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిబట్ల, పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్ తదితర ప్రాంతాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అలాగే, అక్కడి నుంచి సూర్యాపేటలో జరిగిన సమావేశానికి భారీగా తరలివెళ్లారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మంచిరెడ్డి కిషన్‌రెడ్డితో ముచ్చటించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్తేజం నింపాలని..రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో గులాబీ జెండా ను ఎగురవేయాలని దిశానిర్దేశం చేశారు. త్వరలో అన్ని జిల్లాలు, మం డలాలు, గ్రామాల్లో నూ తన కమిటీలు వేసుకుని ముందుకు సాగుదామన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. ఈ సందర్భంగా వర్కింగ్ ప్రెసిడెంట్‌ను కలిసిన వారిలో మాజీ ఎంపీపీ కృపేశ్, మండల పార్టీ అధ్యక్షులు బుగ్గరాము లు, రమేశ్, రమేశ్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఐదు నిమిషాలు దాటితే నో ఎంట్రీ

- **9:35 వరకు పరీక్షా కేంద్రాల్లోకి అనుమతి**
- **ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో టెన్త్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు**



శంకర్‌పల్లి బాయ్స్ హైస్కూల్‌లో టేబుళ్లపై హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న టీచర్లు

రంగారెడ్డి, మార్చి 20 (నమస్తే తెలంగాణ): జిల్లాలో నేటి నుంచి జరుగనున్న పదోతరగతి పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మొత్తం 51,794 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా 249 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ప్రైవేట్ పాఠశాలలు 145, ఎయిడెడ్ పాఠశాలలు 3, కేజీబీవీలు 1, జడ్పీహెచ్‌ఎస్‌లు 85, టీజీఎంఎస్ 7 ఉన్నాయి. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలు ఏప్రిల్ 2న ముగియనున్నాయి. పదోతరగతి పరీక్షలు నిఘా నీడలో జరుగనున్నాయి. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పదిమంది ఫ్లయింగ్‌స్క్వాడ్లు, 249 మంది సిట్టింగ్‌స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. 22 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్‌ను నియమించారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉండనున్నది. కేంద్రాలకు సమీపంలో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివేయనున్నారు. కాగా, నాలుగు ఎయిడెడ్ పాఠశాలల నుంచి 156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనుండగా.. ఒక్క ఎస్ఆర్‌ఏఎం నుంచి 47 మంది, 16 బీసీడబ్ల్యూఎస్ఆర్‌ల నుంచి 1029, నాలుగు ప్రభుత్వ పాఠశాలల నుంచి 320, 20 కేజీబీవీల నుంచి 932, 721 ప్రైవేట్ పాఠశాలల నుంచి 34,910, 9 టీఎంఆర్ఈఎస్‌ఐల నుంచి 492, 9 టీఎస్ఎంఎస్‌ల నుంచి 783, 15 టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌ల నుంచి 1133, 3 టీటీడబ్ల్యూఆర్ఎస్‌ల నుంచి 174, 238 జడ్పీహెచ్ఎస్‌ల నుంచి 11,718 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

### 9:35 లోపే అనుమతిస్తారు..



విద్యార్థులు సమయానికి ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9:35 గంటలకు గేట్లు మూసేస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ లోపలికి అనుమతించరు. విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు పరీక్ష ప్యాడ్, నీలం లేదా నలుపు బాల్ పాయింట్ పెన్నులను మాత్రమే తీసుకెళ్లాలి. **- సుశీందర్‌రావు, రంగారెడ్డి డీఈవో**

## విద్యార్థులను తనిఖీ చేశాకే లోపలికి అనుమతించాలి



జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు సలహాలు ఇస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ : టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశామని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లు తదితర అధికారులతో ఆయన జూమ్‌మీటింగ్ ద్వారా పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను కట్టుదిట్టంగా అమలు చేయాలని, సమీపం లో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసేయాలన్నారు. విద్యార్థులను తనిఖీ చేశాకే లోపలికి అనుమతించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, డీఈవో రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.


## బోరుబావికి మోటర్ బిగింపు

నమస్తే ఎఫెక్ట్

తాండూరు, మార్చి 20 : యాలాల మండలంలోని గిరిజాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ ఆవరణలో 'పొంచి ఉన్న ప్రమాదం' అనే శీర్షికతో గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. ప్రమాదంగా ఉన్న బోరుబావికి మరమ్మతులు చేయించి మోటర్ బిగించారు. యాలాల ఎంఈవో రమేశ్ ఆదేశాలతో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్తుల సహకారంతో పిల్లలకు ప్రమాదం జరుగకుండా చర్యలు చేపట్టారు. మోటర్‌కు కనెక్షన్‌కు ఇచ్చిన విద్యుత్తు వైర్లు నేలపై ఉండడంతో వాటిని కూడా విద్యార్థులకు అందకుండా చర్యలు తీసుకుంటామన్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.



# నిధులు ఇవ్వరు.. నీళ్లు రావు



శివన్నగూడ వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్

## ముందుకు సాగని రాచకొండ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు

- **సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ సర్కారు తీవ్ర నిర్లక్ష్యం**
- **ఇబ్రహీంపట్నం, మహేశ్వరం సెగ్మెంట్లలోని 80 వేల ఎకరాలకు సాగునీరు అందేలా గత కేసీఆర్ ప్రభుత్వం చర్యలు**
- **రూ.1.72 కోట్లతో సర్వే పనులతోపాటు డీపీఆర్ సిద్ధం**
- **ప్రభుత్వం మారడంతో నిలిచిపోయిన పనులు**
- **నిధులు కేటాయించి.. పనులను పూర్తి చేయించాలంటున్న రైతులు, ప్రజలు**

రంగారెడ్డి, మార్చి 20 (నమస్తే తెలంగాణ) : శాశ్వత నీటి ప్రాజెక్టులు లేక.. నీరందక జిల్లాలోని పలు ప్రాంతాలు ఎడారిగా మారుతున్నాయి. సరైన వర్షాలు కురియకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి పంటపొలాలు ఎండిపోతున్నాయి. వ్యవసాయంపై ఆధారపడిన జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు శాశ్వతంగా సాగునీరు అందించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాచకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. దీని ద్వారా ఇబ్రహీంపట్నం, మహేశ్వరం.. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా షాద్‌నగర్ నియోజకవర్గానికి సాగునీరు అందించేలా ప్రణాళికలు రూపొందించింది. అయితే, ప్రభుత్వం మారడంతో ఈ మూడు సాగునీటి ప్రాజెక్టులు అటకెక్కాయి. వీటి విషయంలో రేవంత్ సర్కార్ నిలువెత్తు నిర్లక్ష్యాన్ని చూపుతున్నది. నిధులు విడుదల చేయకుండా రైతన్నలను అరిగోస పెడుతున్నది. వర్షంపైనే ఆధారపడిన జిల్లాలోని గ్రామీణ ప్రాంత రైతుల పం టలు సాగునీరులేక ఎండిపోయి తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. సముద్ర మట్టానికి 638 అడుగుల ఎత్తులో ఉన్న ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌కు ఎలాంటి సాగునీరు వచ్చే మార్గాలు లేవు. ఈ పరిస్థితిలో రాచకొండ ఎత్తిపోతల ద్వారా శాశ్వతంగా సాగు, తాగునీరు అం దించాలని భావించిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరం ఆధ్వర్యంలో శివన్నగూడ రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ నీటితో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలతోపాటు మునుగోడు నియోజకవర్గంలోని సంస్థాన్ నారాయణపురానికి సాగునీరందించేందుకు రాచకొండ ఎత్తిపోతల ప్రాజెక్టును రూపొందించి.. సర్వేకోసం రూ.1.72 కోట్లను కూడా కేటాయించింది.


### 80 వేల ఎకరాలకు సాగు నీరు అందేలా..

రాచకొండ ఎత్తిపోతల పథకం ద్వారా శివన్నగూడ రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ నీటిని ఎత్తిపోసి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని 80 వేల ఎకరాలకు సాగునీరు అందేలా గత ప్రభుత్వం ప్రాజెక్టును రూపొందించింది. శివన్నగూడ రిజర్వాయర్ నుంచి లోయపల్లి వద్ద ఉన్న రిజర్వాయర్‌ను నింపడంతోపాటు అక్కడి నుంచి మంచాల మండలంలోని ఆరుట్ల వద్ద గంగాదేవి తల్లి గుట్టపైన నిర్మించనున్న మరో రిజర్వాయర్‌ను నింపాలన్నదన్నది కేసీఆర్ ప్రభుత్వం ఉద్దేశం. గంగాదేవితల్లి రిజర్వాయర్ నుంచి మంచాల మండలంతోపాటు నారాయణపూర్ మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న గొలుసుకట్టు చెరువులు నింపి భూగర్భజలాలు పెంపొందించేలా ప్రణాళికను రూపొందించారు. అలాగే, గున్‌గల్, తులేకలాన్ సమీపంలో మ రో రిజర్వాయర్‌ను నిర్మించి అక్కడినుం చి ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్, మహేశ్వరం నియోజకవర్గాల్లోని గొలుసుకట్టు చెరువులతోపాటు ఇబ్రహీంప ట్నం, రావిర్యాల పెద్ద చెరువులను నింపాలని భావించారు. ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని 122 చెరువులను నింపడమే రాచకొండ ఎత్తిపోతల పథకం ప్రధాన లక్ష్యం. అలాగే, గ్రావిటీ ద్వారా కాల్వలు నిర్మించి ఇబ్రహీంపట్నం, మంచాల, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాలతో పాటు మహేశ్వరం నియోజకవర్గంలోని సాగునీటి అవసరాలు తీర్చేందుకు చర్యలు చేపట్టారు.

### రూ.1100 కోట్లతో డీపీఆర్ సిద్ధం

రాచకొండ ఎత్తిపోతల పథకానికి రూ.1,100 కోట్లతో రిటైర్డ్ ఇంజినీర్ల ఫోరమ్ డీపీఆర్‌ను సిద్ధం చేసింది. అప్పటి మంత్రి సబితాఇంద్రారెడ్డి అధ్యక్షతన నీటి పారుదలశాఖ అధికారులతో పలు మార్లు సమీక్షలు కూడా నిర్వహించారు. ఈ ప్రాజెక్టు నిధుల కేటాయింపు వరకు రాగానే ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి.

కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి వనరుల ప్రాజెక్టులపై నిలువెత్తు నిర్లక్ష్యాన్ని చూపుతున్నది. ఎలాంటి నిధులు కేటాయించకుండా అన్నదాతలను అరిగోస పెడుతున్నది. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు పంటలు పండక నీటి ఎద్దడితో అప్పుల పాలు కావొద్దనే సదుద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం శాశ్వతంగా సాగునీరు అందించేందుకు రాచకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టింది. శివన్నగూడ రిజర్వాయర్ నుంచి 1 టీఎంసీ నీటిని ఎత్తిపోసి ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని 122 చెరువులను నింపడమే కాకుండా 80 వేల ఎకరాలకు సాగునీరు అందేలా ఈ ప్రాజెక్టును రూపొందించింది. ఇందుకు అవసరమైన సర్వే కోసం రూ.1.72 కోట్లను కూడా కేటాయించింది. రూ.1100 కోట్లతో డీపీఆర్‌ను కూడా సిద్ధం చేసింది. అయితే, ప్రభుత్వం మారడంతో ఆ ప్రక్రియ అక్కడికక్కడే ఆగిపోయింది. నిధులు విడుదల కాకపోవడంతో పనులు ముందుకు సాగడంలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేసి ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని జిల్లాలోని ప్రజలు, రైతులు కోరుతున్నారు.



శివన్నగూడ రిజర్వాయర్‌కు 2014లో గత సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేయగా.. ఏర్పాటు చేసిన శిలాఫలకం

### రాచకొండ ఎత్తిపోతలకు నిధులు కేటాయించాలి

ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల రైతులకు శాశ్వతంగా సాగునీరు అందించాలన్న ఉద్దేశంతో గత కేసీఆర్ ప్రభుత్వం రూపొందించిన రాచకొండ ఎత్తిపోతల పథకానికి రేవంత్ సర్కార్ నిధులు కేటాయించాలి. శాశ్వత సాగునీటి వనరులు లేకపోవడంతో జిల్లా రైతులు ప్రతిఏటా అప్పులుచేసి సాగు చేసిన పంటపొలాలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్నారు. సముద్రమట్టానికి 638 అడుగుల ఎత్తులో ఉన్న ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు అనువైనది ఒక్క రాచకొండ ఎత్తిపోతల పథకమే. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులు కేటాయించి రైతాంగాన్ని ఆదుకోవాలి.

**-మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే**

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం..నిలువెత్తు సాక్ష్యం

**నాడు.. నేడు**





# ఒకనాటి ఉద్యాన వనము.. నేడు కనము..

బొంరాస్‌పేట మండలం, చౌదర్‌పల్లి గ్రామంలోని పల్లెప్రకృతి వనం ఇది.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పచ్చదనంతో అలరారిన ఈ ప్రాంతం కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యంతో ఇలా ఎండిపోయి కళావిహీనంగా మారింది – బొంరాస్‌పేట